ఇటుకలు చేద్దాం.. బహుమతి గెలుద్దాం..

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 19 (నమస్తే తెలంగాణ): 'పర్యావరణహిత మట్టి ఇటుకలు తయారు చేయండి.. బహుమతులు గెలుచుకోండి' అని, ప్రజలకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 'సండే బ్రిక్స్ చాలెంజ్' పేరుతో ఈ కార్యక్రమాన్ని జిల్లా అధికార యంత్రాంగం వినూత్నంగా చేపట్టిందని పేర్కొన్నారు. ఈ నెల 22న (ఆదివారం)ఉదయం 6 నుంచి 9 గంటల వరకు కొత్తగూడెం ప్రగతి మైదానంలో ఈ కార్యక్రమం ఉంటుందని వివరించారు. అందరూ పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమాన్ని బెంగుళూరులోని సీఎస్ఈబీ నిపుణుడు సుధాకర్‌రెడ్డి పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. 'ఇది కేవలం పోటీ మాత్రమే కాదు.. కొద్దిసేపు మట్టితో పనిచేసే అనుభవం. మనలో కొత్త ఉత్సాహాన్నిచ్చే, సరికొత్త మార్పును తీసుకొచ్చే కార్యక్రమం' అని వివరించారు. ఎక్కువ ఇటుకలు తయారు చేసిన వ్యక్తిని బ్రిక్స్ ఛాంపియన్‌గా గుర్తిస్తామని, ఆ విజేతకు బహుమతిగా టీ షర్టును తాను అందజేస్తానని తెలిపారు.

అశ్వారావుపేటలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్

దమ్మపేట రూరల్, జూన్ 19: అశ్వారావుపేటలో రూ.5 కోట్లతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చెప్పారు. అంతర్జాతీయ ఒలంపిక్ డే సందర్భంగా బుధవారం పాల్వంచలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ చేపట్టిన ఒలంపిక్ డే రన్‌ను గురువారం ఉదయం మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. యువత దృష్టిని ఆటల వైపు మళ్లించాలని కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ రెడ్డి, బాధ్యులు కారంగుల మహిధర్, వెంకటేశ్వర్లు, నాగేందర్ పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత

దమ్మపేట రూరల్, జూన్ 19: మండలంలోని గండుగులపల్లి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్లను, క్రీడాసామగ్రిని ఎమ్మెల్యే ఆదినారాయణ గురువారం అందించారు. వీటిని హైదరాబాద్‌కు చెందిన బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సమకూర్చింది. డీఈవో చలపతి రాజు, ఎంఈవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాతగోడకు కొత్త సున్నం.. ఇదే కాంగ్రెస్ తీరు

అశ్వాపురం, జూన్ 19: పాతగోడకు కొత్త సున్నం వేసినట్లుగా కాంగ్రెస్ పార్టీ తీరు ఉందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఎద్దేవా చేశారు. గురువారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వరు గొందిగూడెం ఇసుకవాగు బ్రిడ్జిని ప్రారంభిస్తూ ప్రజాపాలనలో మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పడంతో హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ పాలనలో మాజీ ఎమ్మెల్యే రేగా కృషి ఫలితంగా మంజూరైన ఇసుక వాగు, లోతువాగు బ్రిడ్జిల నిర్మాణం చేపట్టిన ఘనత రేగా కాంతారావుకే దక్కుతుందన్నారు. ఓట్ల కోసం రాజకీయాలు చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఇసుక వాగు బ్రిడ్జి ప్రారంభం

అశ్వాపురం, జూన్ 19: గొందిగూడెం పంచాయతీ పరిధిలోని గొందిగూడెం-అశ్వాపురం గ్రామాల మధ్య ఇసుకవాగుపై రూ.7కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

మణుగూరు టౌన్, జూన్ 19: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా వారికి ఆర్థిక భరోసా ఇస్తుందని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరులోని ప్రజాభవన్‌లో పలువురు లబ్ధిదారులకు రూ.2.30 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు.

క్షయ నివారణపై ప్రచారం

ఇల్లెందు రూరల్, జూన్ 19: క్షయ వ్యాధి నివారణపై మండలంలోని కొమరారం పంచాయతీ బొంబాయితండా, పోచారం తండాలో కొమరారం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత గురువారం ప్రచారం నిర్వహించారు. టీబీ నోడల్ పర్సన్ సమ్మయ్య, ఎస్‌టీఎస్ శంకర్, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఏఎన్ఎం మంజుల, టీబీ అలర్ట్ ఇండియా ఎన్‌జీవో బాధ్యుడు చిర సాయికృష్ణ, 102 డ్రైవర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాకుయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపినస్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **పాండు రంగ జయలక్ష్మి** W/o: (లేటు) జక్కిపల్లి సత్యనారాయణ, వయస్సు: 42సం॥లు, వృత్తి : గృహిణి, నివాసం: దమ్మపేట గ్రామం మరియు మండలం మండలం, భద్రాద్రా కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహార మునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియ జేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి: జిల్లా రిజిస్ట్రారు మరియు ఖమ్మం జిల్లా ప్రజాపరిషత్తు ఖమ్మం దమ్మపేట మండల ప్రజాపరిషత్తు, సత్తుపల్లి సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా దమ్మపేట గ్రామపంచాయితీ, దమ్మపేట గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా వున్న సర్వే నెం. 560 మిం॥లో॥, విస్తీర్ణము : 245 చ॥గ॥ లకు సరియగు 204.852 చ॥మీ॥ నివేశన స్థలం అందు నిర్మించి యున్న 29 x 28 1/2 = 831 చ॥అ॥ల కట్టుబడి, **డాక్యుమెంట్ : 419/1994,** ఇ నెం. 3-113 నెంబరు గల మంగళూరు పెంకు టిల్లు కు సరిహద్దులు **:తూర్పు:** మాచే ఏర్పాటు చేయబడిన 4 గజముల వెడల్పు గల దారి, **దక్షిణము :** మారిశెట్టి కాంతమ్మ గారిఇల్లు ఇండ్ల స్థలం, **పడమర :** దారి, **ఉత్తరము :** గ్రామపంచాయితీ రోడ్డు.

ఇట్లు:**గంధ్ర దీనదయాశ్,** అడ్వకేట్ & నోటరీ, సత్తుపల్లి, ఖమ్మం జిల్లా, సెల్ : 9848578963

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్ Classifieds

WANTED

★**ప్రముఖ విద్యాసంస్థలో** పనిచేయుటకు అనువజ్ఞులైన JUNIOR LECTURERS ALL SUBJECTS (PG), MALE/ FEMALE WARDENS (DEGREE) కలిగిన స్టాఫ్ కావలెను. సంప్ర ॥ 9390126777

KMM

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పాయం పర్యటన

బూర్గంపహాడ్, జూన్ 19: బూర్గంపహాడ్ మండలంలో శుక్రవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటించనున్నట్లు మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు మండలంలోని అన్ని పంచాయతీల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, మిత్రపక్షాల నాయకులు, అనుబంధ సంఘాలు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

30 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

మణుగూరు టౌన్, జూన్ 19: అక్రమంగా నిల్వ ఉంచిన 30 బస్తాల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. మణుగూరు మండలం వాగుమల్లారం గ్రామానికి చెందిన పోతుల వెంకట్‌చౌదరి ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందింది. గురువారం సివిల్ సప్లై డీటీ శివకుమార్ వెళ్లి ఆ ఇంట్లో తనిఖీలు నిర్వహించి 30 బస్తాల రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు డీటీ తెలిపారు.

పాల్వంచ ఆస్పత్రి వైద్యుల సేవలు భేష్

రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

వైద్య సిబ్బందికి ఉత్తమ సేవా పత్రాలు అందజేస్తున్న డాక్టర్ అజయ్‌కుమార్, కలెక్టర్ పాటిల్

పాల్వంచ, జూన్ 19: పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందించే సేవలు బాగున్నాయని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ వైద్య సిబ్బందిని ప్రశంసించారు. పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం సందర్శించిన ఆయన.. ఆస్పత్రిలోని ప్రతీ విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పనితీరును మెచ్చుకున్నారు. ఇటీవల కలెక్టర్ సతీమణి ఈ ఆస్పత్రిలోనే ప్రసవించడం, మరికొందరు ప్రముఖులు కూడా ఇక్కడే ప్రసవాలు చేయించుకోవడంపై ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ తరహా సేవలు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన వైద్య సిబ్బంది 80 మందికి కలెక్టర్ పాటిల్ సమక్షంలో ఉత్తమ సేవా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, డీసీహెచ్ఎస్ రవిబాబు, సూపరింటెండెంట్ రాంప్రసాద్, బూర్గంపాడు సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, వైద్యులు సోమరాజు దొర పాల్గొన్నారు.

మావోయిస్టు నేత గాజర్ల రవిపై 150కి పైగా కేసులు

ఎదురుకాల్పులపై వివరాలు వెల్లడించిన ఏఎస్ఆర్ జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్ఆర్ జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జూన్ 19 : మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవిపై 150కి పైగా కేసులు ఉన్నాయని అల్లూరి సీతారామరాజు(ఏఎస్ఆర్) జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు. ఏపీ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లాలో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు అగ్రనేతలు సహా మరో మహిళా మావోయిస్టు మృతి చెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఎస్పీ బర్దర్ గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏఎస్ఆర్ జిల్లా రంపచోడవరం పోలీస్‌స్టేషన్ పరిధి కింటుకూరు అటవీ ప్రాంతంలో పోలీస్, గ్రేహౌండ్స్ భద్రతా దళాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్ అలియాస్ ఆనంద్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అరుణ(ఎస్‌జెడ్‌సీఎం)తోపాటు మరో మహిళా మావోయిస్టు, పార్టీ సభ్యురాలు అంజు అలియాస్ మాసే సైతం మృతి చెందిన విషయాన్ని ఎస్పీ ధ్రువీకరించారు. వీరిలో గాజర్ల రవి, అరుణలపై 150కి పైగా కేసులు ఉన్నాయని, అంజుపై 22కి పైగా కేసులు ఉన్నాయని వెల్లడించారు. ఏపీ ప్రభుత్వం రవిపై రూ.25 లక్షల రివార్డు, అరుణపై రూ.20 లక్షల రివార్డు, అంజుపై రూ.లక్ష రివార్డు ఇప్పటికే ప్రకటించిందని పేర్కొన్నారు. ఘటనా స్థలం నుంచి ఒక ఏకే-47తోపాటు కిట్ బ్యాగులు, ఖాళీ తూటాలు, నగదు, మావోయిస్టు సాహిత్యం, ఆలివ్ గ్రీన్ దుస్తులు, ఇతర వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఇటీవల వై.రామవరం పోలీస్‌స్టేషన్ పరిధి సేశరాయి, మంప పోలీస్‌స్టేషన్ పరిధి కాంటవరం, కాకుల మామిడి వద్ద జరిగిన ఎదురుకాల్పుల నుంచి పై ముగ్గురు తప్పించుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కాగా.. రవి, అరుణలు.. అరకు ఎమ్మెల్యే కిడారు సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివెరి సోమ హత్య కేసుతోపాటు అన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటగున్న బ్లాస్టింగ్, బలిమెల ఘటన, కొంద్రుం ఐఈడీ పేలుడు ఘటనల్లో కీలక పాత్ర పోషించినట్లు వెల్లడించారు.

సికిల్‌సెల్‌ను ఓడిద్దాం

ఇల్లెందు రూరల్: కొమరారంలో ప్రదర్శన

ఇల్లెందు రూరల్, జూన్ 19: సికిల్ సెల్(రక్త హీనత)ను అందరం కలిసికట్టుగా ఓడిద్దామని ప్రజలకు మండలంలోని కొమరారం, రొంపేడు డాక్టర్లు మురళీకృష్ణ, లోహిత పిలుపునిచ్చారు. వీరు తమ పీహెచ్‌సీలలో గురువారం వేర్వేరుగా సికిల్‌సెల్(రక్తహీనత) దినోత్సవం నిర్వహించారు. గ్రామాల్లో తిరుగుతూ, సికిల్‌సెల్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ''రక్తహీనత అనేది వారసత్వంగా తల్లిదండ్రుల నుంచి వస్తుంది. రక్తం విరగడం(హీమోలైసిస్) కారణంగా కామెర్లు, కళ్లు పాలిపోవడం, అలసట, చేతులు-కాళ్లలో నొప్పితో కూడిన వాపు తదితర ఆరోగ్య సమస్యలు వస్తాయని వివరించారు. చికిత్స తీసుకోకపోతే సమస్య మరింత ఎక్కువవుతుందని, రక్తం ద్వారా ఆక్సిజన్ సరఫరా కాకపోవడంతో శరీరంలోని ఏదో ఒక భాగంలో తీవ్రమైన నొప్పి వస్తుందని చెప్పారు.

టేకులపల్లి, జూన్ 19: సికిల్‌సెల్ నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని సులానగర్ పీహెచ్‌సీ సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కంచర్ల వెంకటేశ్, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, నర్సింగ్ ఆఫీసర్ జగదాంబ, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ చంద్రకళ, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, విజయ, కౌసల్య, ధరణి, అమూల్య, ఇంద్రజ, రుక్సానా, శైలజ పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ ప్రదర్శన

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం అర్బన్, జూన్ 19: పాలస్తీనా, గాజా, ఇరాన్‌పై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులను అందరూ వ్యతిరేకించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. ఇజ్రాయిల్ దాడులకు నిరసిస్తూ గురువారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో వామపక్షాలు ప్రదర్శన నిర్వహించాయి. కూనంనేని మాట్లాడుతూ.. ఇతర దేశాలపై పెత్తనానికి యత్నిస్తున్న ఇజ్రాయిల్‌కు, దానికి మద్దతుగా నిలుస్తున్న అమెరికాకు బుద్ధి చెప్పాలన్నారు. నాయకులు సాబీర్‌పాషా, మచ్చ వెంకటేశ్వర్లు, ముద్దా భిక్షం, అవునూరి మధు, కందగట్ల సురేందర్, కంచర్ల జమలయ్య, ఉప్పరబోయిన రాంమూర్తి, లిక్కి బాలరాజు, జాటోత్ కృష్ణ పాల్గొన్నారు.

రేపు యోగా దినోత్సవం

మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

కొత్తగూడెం సింగరేణి, జూన్ 19: ఈ నెల 21న సింగరేణివ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించాలని జీఎం (పర్సనల్) జీవీ కిరణ్‌కుమార్ అన్నారు. ఈ దినోత్సవ ఏర్పాట్లపై కొత్తగూడెం హెడ్డాఫీస్ నుంచి అన్ని ఏరియాల జీఎంలతో ఆయన గురువారం సమీక్షించారు. సింగరేణి ఉద్యోగులతోపాటు కాంట్రాక్ట్ కార్మికులు కూడా పాల్గొనేలా చూడాలన్నారు. అధికారులు మురళీధర్‌రావు, కేసా నారాయణరావు, శివకేశవరావు, ముకుంద సత్యనారాయణ, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట, జూన్ 19: మండలంలోని గనుగులపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో యోగా డే ఉత్సవాలను గురువారం నాగుపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది నిర్వహించారు. ఆయూష్ డిపార్ట్‌మెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హమీరనాసిన్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివాకర్, ఆయూష్ డిపార్ట్‌మెంట్ యోగా ఇన్‌స్ట్రక్టర్ కె.లక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ సంజయ్ మల్కర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, జూన్ 19: భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యబలిహరణం, నిత్యహోమాలు, నిత్యపూజలు జరిపారు. అనంతరం బేడా మండపంలో స్వామివారికి కల్యాణం జరిపించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు హారం కానుక

ఆలయ ఈవోకి బంగారు హారాన్ని సమర్పిస్తున్న దాతలు

భద్రాచలం, జూన్ 19: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి హైదరాబాద్‌లోని కొండాపూర్‌కు చెందిన భక్తులు కృష్ణచైతన్య, రాజ్యలక్ష్మి దంపతులు 52.25 గ్రాముల బరువైన రూ.4,98,520 విలువైన బంగారు హారాన్ని గురువారం ఆలయ ఈవో రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు వారికి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

యోగాతోనే మానసిక ఉల్లాసం

దుమ్ముగూడెం, జూన్ 19: యోగాతోనే మానసిక ఉల్లాసం, మనస్సుకు ప్రశాంతత కలుగుతుందని యోగా శిక్షకుడు వినీత్‌బాబు అన్నారు. గురువారం యోగా దినోత్సవం సందర్భంగా దుమ్ముగూడెం ఈఎంఆర్ఎస్ పాఠశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు. రాజేష్‌బాబు, పాఠశాల సిబ్బంది హరితేజ, మెహబూబ్, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

వలస ఆదివాసీలు ప్రశాంతమైన జీవనం కొనసాగించాలి

కరకగూడెం, జూన్ 19: అటవీ ప్రాంతాల్లో నివాసముంటున్న వలస ఆదివాసీలు ప్రశాంతమైన జీవనం కొనసాగించాలని ఏడూళ్లబయ్యారం సర్కిల్ సీఐ వెంకటేశ్వర్లు, కరకగూడెం ఎస్ఐ పీవీ నాగేశ్వరరావు అన్నారు. ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని వలస ఆదివాసీ గ్రామాలైన నిమ్మలగూడెం, నీలాద్రిపేట గండిలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అభివృద్ధిని అడ్డుకునే మావోయిస్టులకు వలస ఆదివాసీలు సహకరించవద్దని తెలిపారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లు, చిన్నారులకు పలకలు అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి ముంపును కట్టడి చేయట్లేదు..

బూర్గంపహాడ్, జూన్ 19: స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లయినా గోదావరి ముంపును మాత్రం కట్టడి చేయలేకపోతున్నామని, రాజకీయ పార్టీలన్నీ వారి అవసరాల మేరకు ఎజెండాలు ఏర్పాటు చేసుకుని వారి స్వలాభాల కోసం మాత్రమే పనిచేస్తున్నాయని తెలంగాణ రైతుకూలీ సంఘం నాయకులు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పున్నం చంద్ విమర్శించారు. గురువారం బూర్గంపహాడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో బూర్గంపహాడ్, భద్రాచలం, అశ్వాపురం మండలాలకు పోలవరం బ్యాక్ వాటర్ ముప్పు తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. ముంపు ప్రాంతాల పరిరక్షణ కోసం స్థానికంగా ఉన్నవారంతా కలిసికట్టుగా ఉద్యమిస్తే సమస్య తలెత్తకుండా చూడవచ్చని పిలుపునిచ్చారు.

ఐఐటీలోకి 'గురుకుల' విద్యార్థులు

బి.రవితేజ, జి.గీతుకుమార్, బి.మహేష్, బి.ప్రసాద్, బి.హరిశ్చంద్ర ప్రసాద్

దమ్మపేట, జూన్ 19: దమ్మపేటలోని గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో ప్రతిభ చాటారు. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఐఐటీలలో సీట్లు సాధించారు. వీరిలో భూక్యా రవితేజ (ఐఐటీ-ఖరగపూర్), భూక్యా మహేష్ (ఐఐటీ-పాట్నా), భూక్యా హరిశ్చంద్రప్రసాద్ (ఐఐటీ-రూర్కీ) ఉన్నారు. మరో ఇద్దరు విద్యార్థులు.. గీతుకుమార్(ఎస్ఐటీ-వరంగల్), భూక్యా ప్రసాద్(సెంట్రల్ యూనివర్సిటీ-పంజాబ్) కూడా ప్రతిష్టాత్మక కళాశాల్లో సీట్లు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ సీతారామ్ అభినందించారు.

చోరీ కేసు నిందితుడికి రిమాండ్

చంద్రుగొండ, జూన్ 19: బంగారం, వెండి ఆభరణాలతోపాటు డబ్బు చోరీ చేసిన కేసులో నిందితుడిని పోలీసులు రిమాండుకు తరలించారు. ఎస్సై శివరామకృష్ణ గురువారం తెలిపిన వివరాలు.. చంద్రుగొండ మండలం రావికంపాడు గ్రామస్తుడు పిన్నబోయిన వెంకటేశ్వర్లు కుటుంబం ఇటీవల ఏలూరు వెళ్లారు. వారు తిరిగొచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగింది. బీరువాలోని 10 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి, రూ.50వేలు కనిపించలేదు. వెంకటేశ్వర్లు ఫిర్యాదుతో ఎస్సై శివరామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆయన గురువారం తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి పేరు పిన్నబోయిన రాము. రావికంపాడు గ్రామంలో చోరీ చేసినట్లుగా ఒప్పుకున్నాడు. అతడి నుంచి వెండి, బంగారం, రూ.20వేలను పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేసి, కొత్తగూడెం కోర్టులో హాజరుపరిచారు. ఆ తర్వాత రిమాండుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇల్లెందు రూరల్, జూన్ 19: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం రాత్రి మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అమర్‌సింగ్ తండాకు చెందిన గుగులోత్ సుక్య(40) ద్విచక్రవాహనంపై ఇల్లెందు నుంచి పోచారం వస్తున్నాడు. పోచారం గుడి వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుక్యకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్తం

'దోస్త్' గడువు పెంపు

పాల్వంచ రూరల్, జూన్ 19: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు జరిగే 'దోస్త్' మూడోవిడత తేదీని ఈ నెల 25 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సప్లమెంటరీ ఫలితాలు ఈ నెల 16న విడుదలైనందున తేదీని పొడిగించినట్లు వివరించారు.

'సహాయ ఉపకరణ' దరఖాస్తుల స్వీకరణ

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 19 (నమస్తే తెలంగాణ): సహాయ ఉపకరణాల కోసం జిల్లాలోని అర్హులైన దివ్యాంగుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు, ఈ నెల 27వ తేదీ వరకు గడువు ఉన్నట్లు జిల్లా సంక్షేమ శాఖాధికారి స్వర్ణలత లెనీనా ఒక ప్రకటనలో తెలిపారు. రిట్రోఫిట్టెడ్ మోటార్ వాహనం, బ్యాటరీ వీల్ చైర్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ వీల్ చైర్, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో, హైబ్రిడ్ వీల్ చైర్, ల్యాప్‌టాప్, 5జీ స్మార్ట్ ఫోన్, ట్రై సైకిల్ వీల్ చైర్, వినికిడి యంత్రం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. మరిన్ని వివరాలకు 6301981960, 8331006010 నంబర్లలో సంప్రదించవద్దని సూచించారు.

సీపీఐ మండల కమిటీ ఎన్నిక

బూర్గంపహాడ్, జూన్ 19: మండల పరిధిలోని సారపాక కపర్తి భవనంలో సీపీ